కందకుర్తిలో తాగు నీటి కష్టాలు

- కుళాయిల వద్ద రాత్రింబవళ్లు పడిగాపులు
- ఇబ్బందుల్లో కాలనీవాసులు
- పట్టించుకోని అధికారులు


మురికి గుంతలో కుళాయి పైపు


కుళాయి వద్ద నీటి కోసం స్థానికుల తంటాలు

రెంజల్: మండలంలోని కందకుర్తిలో ప్రజలు తాగు నీటి కోసం తంటాలు పడుతున్నారు. గ్రామంలోని 3, 4, 5, 8 వార్డుల్లో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉంది. కుళాయిల వద్ద గ్రామస్తులు రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. బిందెడు నీటి కోసం గంటల తరబడి కుళాయి వద్ద వెంపర్లాడుతున్నారు. గ్రామంలోని ట్యాంకు నుంచి కుళాయిల ద్వారా తాగు నీటిని విడుదల చేస్తున్నా ఎగువభాగంలోని కొందరు కుళాయిలకు అక్రమంగా మోటార్లు వినియోగించడంతో దిగువ భాగంలోని ప్రజలు నీటి కోసం తిప్పలు పడుతున్నారు. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. దీనికి తోడు పలు కాలనీల్లో కుళాయిలు బురద గుంటలో ఉండటంతో కలుషిత నీరు వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వేసవిలో తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా కాలనీల్లోని అంతర్గత రోడ్లను ధ్వంసం చేసి నల్లాలు బిగించినా చుక్క నీరు అందక అలంకార ప్రాయంగా మిగిలాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. అధికారులు తాగు నీటి సమస్యను పరిష్కరించి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి

మోర్తాడ్/ రుద్రూర్: వరంగల్‌లో ఆదివారం నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ భీమ్‌గల్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య కోరారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మండలం నుంచి 14 బస్సుల్లో 700ల మంది కార్యకర్తలు, నాయకులు బయలుదేరి వెళ్లనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు ఆర్మూర్ మహేశ్, చౌట్‌పల్లి రవి, శివసారి నర్సయ్య, శర్మనాయక్, తుక్కాజి, సతీశ్ గౌడ్, భగత్ తదితరులు పాల్గొన్నారు. వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్త అధిక సంఖ్యలో తరలిరావాలని బీఆర్‌ఎస్ పార్టీ రుద్రూర్ మండల ఇన్‌చార్జి గాండ్ల మధు పిలుపునిచ్చారు. మండలంలోని చిక్కడపల్లి, అంబం(ఆర్), సులేమాన్‌నగర్‌లో శనివారం రజతోత్సవ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ పోచయ్య, ఎన్ సాయిలు, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


చిక్కడపల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న భీమ్‌గల్ మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు

క్లుప్తంగా

బంద్ ప్రశాంతం

మోర్తాడ్: జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి ఘటనను నిరసిస్తూ శనివారం భీమ్‌గల్ పట్టణ బంద్‌కు విశ్వహిందూ పరిషత్ పిలుపునివ్వగా ప్రశాంతంగా జరిగింది. బైక్‌లపై ర్యాలీ నిర్వహిస్తూ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసి ఉంచారు. ఎస్సై మహేశ్ బందోబస్తును పర్యవేక్షించారు.

పశువులకు టీకాలు



మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లిలో మండల పశువైద్యాధికారి కిరణ్‌దేశ్‌పాండే ఆధ్వర్యంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించి పశువులకు టీకాలు వేశారు. వేసవిలో పశువులకు సోకే గాలికుంటు వ్యాధిని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యగా పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది టి వినీత, ఆర్ కల్యాణి, అహ్మద్‌పాష, పుష్ప, గంగాధర్, మహేశ్వరి, సిఖిందర్, బేగ్, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

మోర్తాడ్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల సూచించారు. శనివారం మండలంలోని వడ్యాట్‌లో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కవిత, శోభ, ఆశా వర్కర్ మమత తదితరులు పాల్గొన్నారు.

ఐదు శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్మూర్‌టౌన్: ఆస్తి పన్ను బకాయిదారులు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 30లోగా చెల్లిస్తే ప్రభుత్వం ఐదు శాతం రాయితీ కల్పిస్తున్నట్లు కమిషనర్ రాజు శనివారం తెలిపారు. అలాగే భూములు క్రమబద్ధీకరించుకునే వారు ఎల్‌ఆర్‌ఎస్ రుసుమును ఈ నెల 30లోగా చెల్లిస్తే 25 శాతం రాయితీ పొందే అవకాశం ఉందన్నారు. దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్షికోత్సవం



రుద్రూర్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న చిన్నారులకు శనివారం ప్రగతి పత్రాలు అందజేశారు. అంగన్‌వాడీ విద్య పూర్తి చేసుకున్న చిన్నారులకు పాఠశాలల్లో చేర్పించనున్నట్లు టీచర్లు వెల్లడించారు. చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, అంగన్‌వాటీ టీచర్లు సునంద, గంగామణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్లు అందజేత



ఆర్మూర్‌టౌన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల బాధితులకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ ఫోన్లను శనివారం అందజేశారు. బాధితులకు పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి బాధితులకు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటగా చలివేంద్రాలు



నందిపేట్: ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాలు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. నందిపేట మండలంలోని వెల్మల్‌లో జీపీ ఆధ్వర్యంలో నెల రోజుల క్రితం ప్రజల దాహార్తి కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడు రోజులు ప్రజలకు నీటిని అందించి చేతులెత్తేశారు. చలివేంద్రాల వద్ద నీటిని నిల్వ చేసే రంజన్లు సైతం లేకుండా పోయాయి. కొందరు దుండగులు రంజన్లను ఎత్తుకుపోగా ఆకతాయిలు కొన్నింటిని పగులగొట్టారు.

చలో ఆర్మూర్‌ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న గౌడ సేవా సమితి ప్రతినిధులు

బోధన్‌టౌన్: గ్రామ కమిటీల ఆగడాలను నిరసిస్తూ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 29న చేపట్టిన చలో ఆర్మూర్‌ను విజయవంతం చేయాలని ఆర్మూర్ డివిజన్ కుల జేఏసీ అధ్యక్షుడు నరసింహచారి కోరారు. శనివారం పట్టణంలోని పీఆర్టీయూ భవనంలో సమావేశం నిర్వహించారు. ఇటీవల కాలంలో ఆర్మూర్ డివిజన్‌లో చేతి, కుల వృత్తులు చేసుకునే వారిపై వీడీసీల ఆగడాలు ఎక్కువ అవుతున్నాయని, కుల వృత్తులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో నాయకులు యాదాగౌడ్, రామాగౌడ్, గంగాధర్ గౌడ్, రాజేశ్, సాగర్, నక్క లింగారెడ్డి, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


సాలూరలో చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోధన్: సాలూర మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తహసీల్ కార్యాలయ ఆవరణలో శనివారం పంపిణీ చేశారు. చెక్కుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చీల శంకర్, అల్లె జనార్దన్, భూమయ్య, నాగేశ్వర్‌రావు, మందర్నా రవి, కుమ్మన్‌పల్లి నరేందర్‌రెడ్డి, హన్మాండ్లు పాల్గొన్నారు.

పచ్చలనడ్కుడలో..

వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో అరుగురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టక్కర్ గంగాధర్, గుడాల మోహన్, జి నర్సారెడ్డి, లింగేశ్వర్, అలీముద్దీన్, చిన్నముత్తెన్న, భోజన్న, నెహ్రూ, జల్లభూమన్న, సాయిరాం, చక్రపాణి, బాబుల్, నవీన్, కృపాల్ తదితరులు పాల్గొన్నారు.


పచ్చలనడ్కుడలో

ఎల్‌వోసీ మంజూరు

బాల్కొండ: మండలంలోని బోదేపల్లి గ్రామానికి చెందిన మామిడి నివేదిత అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మెదడుకు రక్త ప్రసరణ కోసం బైపాస్ సర్జరీకి వైద్య సహాయం కావాలని బాధితులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డిని కోరారు. స్పందించిన ఆయన ప్రభుత్వం ద్వారా రూ. 2.5 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. దీంతో ఎల్‌వోసీని బాధిత కుటుంబానికి శనివారం అందించారు. ఎల్‌వోసీ మంజూరుకు కృషి చేసిన సునీల్‌రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాలి


వేల్పూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు


రుద్రూర్: రాణంపల్లిలో గ్రామ యువకులు

రుద్రూర్: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడులు జరిపిన ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శనివారం రాత్రి రుద్రూర్ మండల కేంద్రంలో ముస్లింలు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రవాదులపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని రాణంపల్లిలో గ్రామ యువకులు, పెద్దలు కొవ్వత్తులతో మౌనం పాటించి నివాళులు అర్పించారు. జి మహేందర్, గాండ్ల మధు, గంగారాం పటేల్, సురేశ్ గౌడ్, సాయన్న, గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో..

కోటగిరి మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నన్నేసాబ్, జాకీర్, లింగం, అర్జున్, సాయవ్వ, లింగవ్వ, పోచవ్వ తదితరులు పాల్గొన్నారు.


రుద్రూర్‌లో ముస్లింలు

వేల్పూర్‌లో..

వేల్పూర్: పహల్గాం మృతులకు నివాళులర్పిస్తూ వేల్పూర్‌లో యువజన సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు.

పెర్కిట్: పహల్గాంలో పర్యాటకులపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని పీసీసీ మాజీ కార్యదర్శి, రక్షా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖాందేష్ శ్రీనివాస్ అన్నారు. పహల్గాం ఘటనలో అసువులు బాసిన వారికి నివాళులర్పిస్తూ శనివారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జీజీ ఫౌండేషన్ చైర్మన్ గుజరాతి నివేదన్, జెస్సు ఆనంద్, గంగామోహన్ చక్రు, డీజే దయానంద్, అల్జాపూర్ గంగామోహన్, ఎస్ శ్రీనివాస్, ప్రవీణ్ పవార్, ఎస్ విజయ్, అరవింద్, రాజేశ్, వేణు, ప్రవీణ్, ఆనంద్, మంచిర్యాల కిషన్, గంగా రెడ్డి, రాజేశ్వర్, దత్తాద్రి, నారాయణ వర్మ తదితరులు పాల్గొన్నారు.


కోటగిరిలో సీఐటీయూ నాయకులు, జీపీ కార్మికులు


పెర్కిట్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

తరగతి గదిలో ఉపాధ్యాయుల పాత్రపై పరిశోధన

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం చౌదారపు రాంప్రసాద్ 'బహు భాష భాషా తరగతి గదిలో ఉపాధ్యాయుల పాత్ర' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. వరంగల్‌లో బ్రిటిష్ కౌన్సిల్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో రాంప్రసాద్ పాల్గొని తన పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఉన్నత పాఠశాల విద్యార్థుల గణిత అభ్యసనంలో ద్విభాషా దృశ్య ఉపకరణాల ప్రభావం అనే అంశంపై రాంప్రసాద్ గతేడాది కాలంగా మెంటర్ వినయాధర్ రాజు ఆధ్వర్యంలో పరిశోధన చేస్తున్నారు. ఉపాధ్యాయులు గణిత బోధనలో బహుభాషా విధానం ద్వారా బోధించడంతో విద్యార్థులు సులభంగా క్లిష్టమైన అధ్యాయాలు జామెట్రీ, మెన్సురేషన్, ఆల్జీబ్రా, ట్రిగనోమెట్రీ అవగాహన చేసుకుంటారని, తద్వారా విద్యార్థులకు గణితంపై ఆసక్తి, అభిరుచి పెరిగి ఉత్తమ గ్రేడ్లు సాధిస్తారని ఆయన తెలిపారు.


మాట్లాడుతున్న రాంప్రసాద్

ఆధ్యాత్మికం

కొనసాగిన అఖండ శివనామ సప్తాహం



బోధన్: సాలూర మండల కేంద్రంలో వీరశైవ లింగాయత్ సమాజ్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అఖండ శివనామ సప్తాహం శనివారం మూడో రోజు కొనసాగింది. సప్తాహం శిబిరానికి విచ్చేసిన గుడిమెట్ల ఆశ్రమ మహారాజ్ మహాదేవ్ స్వామి భక్తులకు ప్రవచనాలు చేశారు. ప్రతి ఒక్కరూ దైవ మార్గంలో నడవాలన్నారు. శిబిరంలో శివనామ సంకీర్తన, భజనలు, పరమ రహస్య సామూహిక గ్రంథపారాయణం కార్యక్రమాలు కొనసాగాయి. సమాజ్ గ్రామ కమిటీ ప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గోరిభా కాకా పుణ్య తిథి



రుద్రూర్: మండల కేంద్రంలో గోరిభా కాకా పుణ్యతిథి కార్యక్రమాన్ని శనివారం కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. గోరాభా కాకా చిత్ర పటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం ప్రధాన వీధుల ద్వారా భజనలు, సంకీర్తనలు చేస్తూ శోభాయాత్ర చేపట్టారు. ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో భజన మండలి బృందం, కుమ్మరి శాలివాహన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పార్క్‌లో సౌకర్యాలను మెరుగుపర్చాలి


భీమ్‌గల్‌లోని అర్బన్ పార్క్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

మోర్తాడ్: భీమ్‌గల్‌లోని అర్బన్ పార్క్‌లో సౌకర్యాలను మెరుగుపర్చాలని మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ సూచించారు. శనివారం ఆయన పార్క్‌ను సందర్శించారు. పార్కులో ఆట వస్తువులు చెడిపోయినందున వాటిని బాగు చేయించాలని, బాత్‌రూంలను శుభ్రం చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డీఆర్‌సీ సెంటర్‌కు తరలించాలని సూచించారు.

మే డే పోస్టర్ల ఆవిష్కరణ



నందిపేట్: మండలంలోని సీహెచ్ కొండూర్‌లో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మేడే పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సాయిరెడ్డి, హరిదాసు, విఠల్, బాలు, లక్ష్మి, నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపులపై పట్టింపేది!

- ఉమ్మడి బాల్కొండలో 82 చేతి పంపులు
- సగానికంటే ఎక్కువ నిరుపయోగమే


కిసాన్‌నగర్‌లో భూమిలో కూరుకుపోయిన చేతి పంపు

బాల్కొండ: ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన చేతి పంపులపై పట్టింపు లేకుండా పోయింది. ఫలితంగా చేతి పంపులు భూమిలో కూరుకు పోతున్నాయి. ఉమ్మడి బాల్కొండ(బాల్కొండ, ముప్కాల్, మెండోరా) మండలాల పరిధిలో 82 చేతిపంపులు ఉన్నాయి. అందులో సగం కంటే ఎక్కువ పనిచేయడం లేదు. కొన్ని చోట్ల చేతి పంపుల బోరు బావుల్లోనే మోటర్లు బిగించారు. మరికొన్ని చోట్ల చేతి పంపులు పని చేయక పోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయి. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి చేతి పంపులు పని చేయని బోరు బావుల వద్ద మోటర్లను బిగిస్తే నీటిని ఎత్తిపోయవచ్చు. కానీ అధికారులు ఆ దిశగా కృషి చేయడం లేదు. వేసవిలో పల్లెల్లో నీటి ఎద్దడి ఏర్పడుతున్నందున ఇలాంటి నిరుపయోగంగా ఉన్న చేతి పంపులను వినియోగంలోకి తీసుకొస్తే ఉపయోగకరంగా ఉంటుంది. డివిజన్ మొత్తానికి ఒక్కరే చేతి పంపులు మరమ్మతులు చేసే మెకానిక్ ఉండటంతో మరమ్మతులు చేపట్టడం కుదరడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	మ్యాడ్‌స్క్వేర్(తెలుగు)-11.10, 7.45, మధురం-1.55 జాక్(తెలుగు) 4.50, డియర్ ఉమ-10.30
స్క్రీన్-2	ఓదెల-2-10.00, 1.05, 4.10, 7.15, 10.20
స్క్రీన్-3	జాక్(తెలుగు)-11.15, 8.40 మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-2.10, 5.10
స్క్రీన్-4	అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి-10.30, 1.30, 4.30, 7.30,10.30



మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,000	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	90,465		

– నిజామాబాద్ బిజినెస్

జీపీకి వంద మంది కూలీలకే ఉపాధి..!

- తగ్గిన ఉపాధి పని
- మేజర్ పంచాయతీల్లో తప్పని తిప్పలు

బాల్కొండ: ఉపాధి హామీ పథకంలో ప్రతి రోజు వంద మంది కూలీలకే పని కల్పించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో మేజర్ పంచాయతీల్లో సగం మందికి కూడా ఉపాధి లభించడం లేదు. దీంతో ఒక వారం కొందరు, మరో వారం మరికొందరు కూలీలకు పని కల్పిస్తున్నారు. దీంతో కూలీలు ఆవేదన చెందుతున్నారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా, కిసాన్‌నగర్, రెంజర్ల లాంటి మేజర్ జీపీల్లో ఉపాధి కూలీలు రోజుకు వంద కంటే ఎక్కువ మంది హాజరవుతున్నారు. వంద మందికి మించి హాజరు వేయకూడదన్న నిబంధనలు ఉండడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు తలలు పట్టుకుంటున్నారు. పెరిగిన కూలీ ప్రకారం రోజుకు రూ. 312 కూలి కూడా రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి కూలీలకు వేసవిలో అందించాల్సిన అలవెన్సులు కూడా అందడం లేదు. కొన్ని గ్రామాల్లో రెండు గ్రూపులతో కలిపి రెండు రోజులు పని చేయించి ఒక్క రోజు హాజరు వేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు వచ్చే వేతనాలను ఇతర పనులకు మళ్లించడం వలన కూలీలకు కూలి దక్కడం లేదు. బాల్కొండ మండల పరిధిలో పది జీపీలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశానుసారం అయిన వెయ్యి మంది కూలీలకు ఉపాధి కల్పించాలి. కానీ 604 మందికి మాత్రమే ఉపాధి కల్పిస్తున్నారు. ఇక్కడ చిన్న, చిన్న గ్రామాల్లో 50 నుంచి 60 మంది కూలీలు మాత్రమే వస్తున్నారు. మేజర్ పంచాయతీల్లో వంద దాటుతున్నారు. సగం మందికి మాత్రమే ఉపాధి కల్పించడంపై ఉపాధి కూలీలు ఆందోళన చెందుతున్నారు. వంద రోజుల పని అందరికి కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.


ముప్కాల్‌లో ఉపాధి పని చేస్తున్న కూలీలు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఉపాధి కూలీల హాజరు వేస్తున్నాం. వారం లో కొందరికి, మరో వారం మరికొందరికి పని కల్పిస్తున్నాం. నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నాం. – ఇందిర, ఏపీవో, బాల్కొండ